https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737




# డీకే సార్ధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 291 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | గురువారం, ఆగస్టు,20, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

# రూ.13,041 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం..

**న్యూఢిల్లీ,ఆగస్టు 19:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ. 13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ. 9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ. 3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ. 1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ. 2,286 కోట్లు కేటాయించారు ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. అలాగే బిహార్‌లోని



ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ. 3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

# ఓట్ల తొలగింపుపై సమరశంఖం

## కేంద్రాన్ని హెచ్చరించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం,ఆగస్టు 19: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ఓట్ల తొలగింపు పేరిట కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు కుట్రపూరిత రాజకీయాలకు ఒడిగడుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పీఏసీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కో ఇన్ చార్జి సచిన్ సావంత్ హాజరయ్యారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డి, ఖమ్మం జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే



4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి, ప్రతిపక్షాలు నెలకు రూ.4 నుంచి 5 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని శ్రేణులంతా సమర్ధవంతంగా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక స్థానాలను గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే కాంగ్రెస్ శ్రేణుల ప్రధాన లక్ష్యమని పొంగులేటి స్పష్టం చేశారు.

## తెలంగాణలో 7,437 పోలీస్ ఉద్యోగాలు..

# ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ..





**హైదరాబాద్,ఆగస్టు 19:**తెలంగాణ రాష్ట్రంలో పోలీసు, అనుబంధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 7,437 ఉద్యోగాల నియామక ప్రక్రియ నేటి ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం అయింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీజీపీఆర్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రక్రియ కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ స్త్రజూతీవి.ఱఅ లో దరఖాస్తులు సమర్పించవచ్చు. సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్లికేషన్లకు అవకాశం ఉంది. ఈ నియామకాల్లో పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖ విభాగాల్లోని పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ), అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో), భారీ సంఖ్యలో సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఫైర్ ఫైటర్లు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, జైళ్ల శాఖలో వార్డర్లు, డిప్యూటీ జైలర్ పోస్టులు ఉన్నాయి. ముఖ్యంగా 3,697 సివిల్ కానిస్టేబుల్ ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం ఈసారి అభ్యర్థుల వయోపరిమితిని పెంచడంతో దరఖాస్తుదారుల సంఖ్య మునుపటి కంటే భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకత కోసం అధికారులు ఈసారి ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేశారు. దీనికోసం అభ్యర్థులు తమ ఫోన్లలో ముందుగానే ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. దరఖాస్తు విధానం పార్ట్-1, పార్ట్-2ల ద్వారా జరుగుతుంది. అభ్యర్థులు తమ మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకున్న తర్వాత అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంతకాన్ని నిర్దేశిత పరిమాణంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చివరి తేదీ వరకు వేచి చూడకుండా అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సకాలంలో దరఖాస్తులు పూర్తి చేసి అభ్యర్థులు తమ అర్హతకు తగ్గ పోస్టులకు పోటీపడవచ్చు.

# సంచలన నిర్ణయం తీసుకున్న జార్ఖండ్ ప్రభుత్వం..

## 44 నియామక పరీక్షలు రద్దు..

జార్ఖండ్ :జార్ఖండ్ ప్రభుత్వం 2014 నుంచి నిర్వహించిన ఏకంగా 44 ప్రభుత్వ నియామక పరీక్షలను రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ , టీడీపీఎల్ అనే ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ముఖ్యంగా జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్ష రద్దు నిర్ణయంపై తీవ్ర కలకలం రేగింది. ఈ రద్దు నిర్ణయంతో అప్పటికే ఎంపికై, వివిధ ప్రభుత్వ శాఖల్లో బాధ్యతలు స్వీకరించిన దాదాపు 2,000 మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారదర్శకంగా ఎంపికైన తమను కూడా అక్రమార్కులతో కలిపి శిక్షించడం సరికాదని, రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాంచీలోని సెక్రటేరియట్ నుంచి బిర్సా చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ వివాదం వెనుక సీఐడీ చేపట్టిన సమగ్ర దర్యాప్తు కీలక పాత్ర పోషించింది. కీలక నిందితుడైన అభయ్ తివారీ కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయడంతో పాటు, వివిధ పరీక్షల్లో పాస్ అవ్వడానికి రూ. 2 లక్షల



నుంచి రూ. 70 లక్షల వరకు రేట్ చార్టులు ఉన్నట్లు అధికారులు గుర్తిం చారు. కేసులో ఇప్పటివరకు 22 మందిని అరెస్టు చేశారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సమర్థిస్తూ.. నియామక వ్యవస్థపై నిరుద్యోగుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణల కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ ఆధ్వర్యంలో సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు.

# డీఎంకే నేతల అవినీతి వివరాలు నా దగ్గర ఉన్నాయి : సీఎం విజయ్



చెన్నై, ఆగస్టు 19: ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని..సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. ఆ ఫైల్స్ ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.

# భారత్, బంగ్లాదేశ్ మధ్య గంగా నీటి వివాదం..

## డిసెంబర్‌తో ముగియనున్న 1996 నీటి ఒప్పందం..

### కొత్త ఒప్పందంలో "హామీ నిబంధన" కోరుతున్న బంగ్లాదేశ్..

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇప్పటికే తీస్తా నది వివాదం ఉద్రిక్తంగా మారగా, ఇప్పుడు గంగా నదీ జలాలపై బంగ్లాదేశ్ కన్నేసింది. 1996 నాటి గంగ జలాల ఒప్పందం 2026 డిసెంబర్‌తో ముగుస్తోంది. ఈ ఒప్పందం పునరుద్ధరణకు ముందు, కొత్త డిమాండ్ తీసుకువచ్చింది. కొత్త ఒప్పందంలో "హామీ నిబంధన"ను చేర్చాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది. ఈ హామీ ఇస్తే వేసవి కాలంలో కూడా ఆ దేశానికి నీటి సరఫనా కొనసాగుతుంది. అవసరమైతే ఈ విషయంపై అంతర్జాతీయ వేదికను ఆశ్రయించడానికి కూడా ఢాకా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ జలవనరుల శాఖ మంత్రి షాహిదుద్దీన్ చౌదరి అని, మంగళవారం ఢాకాలో బంగ్లాదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ నిర్వహించిన "గంగా జల ఒప్పందం: పునః చర్చల అంశాలు" అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఈ విషయం చెప్పారు. గంగా జలాల పంపిణీ ఒప్పందంపై 1996 డిసెంబర్ 12న భారత్, బంగ్లాలు సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాల మధ్య జరి గింది. ఈ ఒప్పందం కాలపరిమితి 30 ఏళ్లు. ఇది డిసెంబర్ 2026తో ముగుస్తోందివర్షాభావ లేదా నీటిమట్టం తక్కువగా ఉండే కాలాల్లో ఫరక్కా వద్ద లభించే గంగా నది జలాలను భారత్, బంగ్లాల మధ్య పంపిణీ చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. ఈ ఒప్పందం




ఏడాది పొడవున నీటి పంపిణీకి సంబంధించింది కాదు. ప్రధానంగా జనవరి 1 నుంచి మే 31 వరకు ఉండే నీటి కొరత కాలానికి సంబంధించింది మాత్రమే. ప్రస్తుత గంగా జలాల ఒప్పందం రూపొందిం చిన సమయంలో ఉన్న జల పరిస్థితులు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని బంగ్లాదేశ్ వాదిస్తోంది. వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం, కరువు వంటి కారణాలతో నదీ ప్రవాహాలు మరింత అనిశ్చితంగా మారాయని పేర్కొంటోంది. కొత్త ఒప్పందంలో 'సమాచార హక్కు' నిబంధనను చేర్చాలని, అలాగే 1977 గంగా ఒప్పందంలో ఉన్నా 1996 ఒప్పందంలో తొలగించిన 'హామీ నిబంధన'ను తిరిగి చేర్చాలని బంగ్లాదేశ్ కోరుతోంది. ఈ నిబంధన ద్వారా దిగువన ఉన్న దేశానికి నిర్దిష్ట కనీస పరిమాణంలో నీటిని అందించే హామీ. ముఖ్యంగా కరువు పరిస్థితుల్లో నీటి లభ్యతను నిర్ధారించడమే దీని ఉద్దేశ్యం.



డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం, ఆగస్టు,20, 2026

# యుద్ధ అంచున నిలిచిన ప్రపంచం!

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొం టున్నాయి. "ఆపరేషన్ ఎపిక్ ఫూరీ" పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్సుస్సేన్ అమీరాబాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హార్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది. మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా?ఇజ్రాయిల్?యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి. భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

## – కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 19(డీ కే చాటింపు) : జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై



దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్య ప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పండుగలు జరుపు కోవడమే కాదు సంప్రదాయాలను తరతరాలకు అందించాలి

## చక్రపు హరికృష్ణ దైవం సంస్థ వ్యవస్థాపకులు




ఎల్బీనగర్, ఆగస్టు19, డీకే చాటింపు:-సనాతన ధర్మాన్ని పాటిస్తూ సంప్రదాయం ప్రకారం పూజలు ధర్మ కార్యాలు నిర్వహిస్తూ దైవ అనుగ్రహం కోసం ప్రకృతి పర్యావరణ హిత సామాగ్రి ప్రతి ఇంటికి చేరాలనే చేర్చాలనే సంకల్పంతో చక్రపు హరికృష్ణ, ఆకుల యజ్ఞ వారి స్నేహ బృందం ఒక నూతన శకానికి నాంది పలికింది. ప్రస్తుతం ఉరుకులు పరుగుల జీవితంలో అన్నింటినీ సమగ్రంగా సమకూర్చుకోలేని వారికి సపోర్ట్ గా నిలుస్తూ సరసమైన ధరలతో నాణ్యమైన పవిత్రమైన వస్తువులతో పాటు గోమాతను కూడా మన ఇంటికి పంపించేందుకు ఏర్పాటు చేయబడిన వేదిక దైవం. అందుకు సంబంధించిన లోగో ఆవిష్కరణ కార్యక్రమం వనస్థలిపురంలో మహిమ గలిగిన మహా గణపతి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్లోక వాఌన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గూడూరు హరినాథ్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, స్వదేశీ భూషణ్ అవార్డ్ గ్రహీత డాక్టర్ టి సురేందర్ ఆలయ ఉపాధ్యక్షులు మిట్ట రామ్మోహన్, కంచి కృష్ణమోహన్ వేదపండితులు పాల్గొని లోగోను ఆవిష్కరించడం జరిగింది. మరిన్ని వివరాలకోసం www.daivamonline.com+91 9063516497 సంప్రదించవచ్చు అని తెలిపారు. పండుగలను జరుపుకోవడమే కాదు మన సంప్రదాయాన్ని తరతరాలకు అందించాలి. ఘనంగా దైవం -- ప్రతి కుటుంబానికి పండుగల సహచరి ఆన్‌లైన్ సేవలను ప్రారంభించడం జరిగింది. దైవం వ్యవస్థాపకుడు చక్రపు హరి కృష్ణ, ఆయన సోదరుడు ఆకుల యజ్ఞతో పాటు ఇతర బృంద సభ్యులు, ఆహ్వానితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో సేవలను




ప్రారంభించారు. పండుగలు కేవలం వేడుకలు మాత్రమే కాకుండా, వాటి వెనుక తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక జ్ఞానం, కుటుంబ విలువలు, సనాతన సంప్రదాయాలు ఉన్నాయని చక్రపు హరి కృష్ణ తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఈ సంప్రదాయాలు తర్వాతి తరాలకు దూరమవుతున్న నేపథ్యంలో, వాటిని సులభంగా అర్థం చేసుకుని ఆచరించేలా చేయాలనే ఆలోచనతో దైవం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. పండుగల ప్రత్యేక కిట్ల నుంచి సమగ్ర పండుగ అనుభవం వరకు దైవం ప్రారంభ దశలో వివిధ పండుగలకు అవసరమైన పండుగ కిట్లు, పూజా సామగ్రి మరియు ఆధ్యాత్మిక ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానుంది. పండుగకు అవసరమైన సామగ్రిని ఒకే కిట్‌గా రూపొందించి వినియోగదారుల ఇంటికే అందించడం ప్రధాన సేవల్లో ఒకటిగా ఉంటుంది. అయితే దైవం లక్ష్యం కేవలం ఉత్పత్తుల విక్రయానికి పరిమితం కాదు. భవిష్యత్తులో పండుగలు, ప్రాంతీయ సంప్రదాయాలు, పూజా విధానాలు, ఆధ్యాత్మిక జ్ఞానం మరియు కుటుంబ వేడుకలనుత్వరలో మొబైల్ యాప్...దైవం మొబైల్ అనువర్తనాన్ని కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. పండుగల సమాచారం, పూజా విధానాలు, పండుగ కిట్లు, ఆధ్యాత్మిక విషయాలు తదితర సేవలను ఒకే వేదికపై అందించేలా ఈ అనువర్తనాన్ని అభివృద్ధి చేయనున్నారు. పండుగను జరుపుకోవడం మాత్రమే కాదు... దాన్ని అర్థం చేసుకోవాలి, మన సంప్రదాయాలను సంరక్షించాలి, భవిష్యత్ తరాలకు అందించాలి" అనే ఆలోచనతో దైవం ఒక సాధారణ వాణిజ్య వేదికగా కాకుండా, ప్రతి కుటుంబానికి పండుగల సహచరిగా నిలిచే సమగ్ర పండుగ అనుభవ వేదికగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. దైవం -- ప్రతి కుటుంబానికి పండుగల సహచరి తో సవ్యంగాపండుగలు జరుపుకుందాం అర్థం చేసుకుందాం సంరక్షిద్దాం తరతరాలకు అందిద్దాం అన్నారు.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పీఏసీ సమావేశం

నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు18 (డీ కే చాటింపు): ఉమ్మడి జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఆకుల లలిత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలకు వివిధ స్థాయిల్లో ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలిపారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అధికంగా జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 2002 ఆధారిత పత్రాల పరిశీలనతో పాటు ఓటరు జాబితాల వివరాల విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, సవరణ ప్రక్రియ సజావుగా జరగని ప్రాంతాలపై డీసీసీ అధ్యక్షులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మండల కాంగ్రెస్ కమిటీల నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం




దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త బాధ్యత అని ఆయన అన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు చురుకుగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 19 (డీ కే చాటింపు): నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ లకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

# ఇది ప్రజా ప్రభుత్వం కాదు... ప్రజా కంటక ప్రభుత్వం!

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు




హైదరాబాద్, (డీకే చాటింపు) బీఆర్ఎస్ భవన్‌లో మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు సబితా ఇంద్రారెడ్డి పాల్గొని రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలు, 22-ఎ నిషేధిత జాబితాలో భూముల చేర్పు, సర్వేయర్ల సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, మరోవైపు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. 6 వేల మంది సర్వేయర్లకు ఇచ్చిన లైసెన్సులను కూడా ఉద్యోగాల లెక్కల్లో కలిపి, 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పడం పచ్చి అబద్ధమని విమర్శించారు. సర్వేయర్లకు జీతాల విషయమై కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా సరైన పరిష్కారం చూపకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మరోవైపు 40--50 ఏళ్ల క్రితమే భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న ప్రజల భూములను సైతం 22–ఎ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని లిమాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భూములు, ఇళ్లపై 22–ఎ పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే ఆపాలని, నిషేధిత జాబితాలో చేర్చిన భూములను సమగ్రంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి...సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలి...22–ఎ పేరుతో జరుగుతున్న అన్యాయానికి స్వస్తి పలకాలి! ప్రజల కోసం ప్రభుత్వం ఉండాలి... ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రభుత్వం కాదు

# న్యూ గడ్డిఅన్నారం కాలనీలో స్టార్మ్ వాటర్ నాలా కనెక్టివిటీ పనులు ప్రారంభం


ఎల్బీనగర్, ఆగస్టు 19 (డీకే చాటింపు) గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద స్ట్రామ్ వాటర్ నాలా నిర్మాణం పూర్తయినప్పటికీ, కనెక్టివిటీ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఈ సమస్యపై బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం డివిజన్ ఏ.ఈ సాయి గారితో కలిసి నాలా కనెక్టివిటీ పనులను ప్రారంభించి, పనుల పురోగతిని పరిశీలించారు. బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో నాలా కనెక్టివిటీ పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రతిరోజూ పనులను అధికారులు పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాలా కనెక్టివిటీ పనుల సమయం లో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తామని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# నిజామాబాద్ నగరంలో ఫోటోగ్రఫీ దినోత్సవం సంబరాలు

నిజామాబాద్ విలేకరి (డీ కే చాటింపు):అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిజామాబాదు నగరంలో ఈరోజు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి సమావేశంలో నిజాంబాద్ పట్టణ మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఫోటోగ్రాఫర్లు విచ్చేశారు. 1839లో లూయిస్ డాగ్రే అనే ఫ్రాన్స్ ఫోటోగ్రాఫర్ కళల పట్ల ప్రజల్లో విస్తృతంగా పరిచయం చేశాడని అతని పుట్టిన రోజుని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం జరపాలని ఫ్రాన్స్ నిర్ణయించింది. ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అధ్యక్షుడు శివాజీ, నరేందర్ రాజు ,శ్రీకాంత్ సభ్యులు పాల్గొన్నారు.



# టార్గెట్ రేవంత్...



**హైదరాబాద్, :** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది. తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది. సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కచ్చితమైన ఖండన లేకపోవడం వల్లే బీఆర్ఎస్ తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచుతోంది. కేటీఆర్ అండ్ కో ఈ ఇష్యూ ద్వారా రెండు ప్రయోజనాలను ఆశిస్తున్నారు. ఒకటి.. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం కూడా అదే చేస్తోందని ముద్ర వేయడం. రెండు.. సీఎం ఇమేజ్‌ను డ్యామేజ్ చేసి, ప్రభుత్వంపై నెగెటివిటీ పెంచడం. కాంగ్రెస్ పార్టీ ఈ ఆరోపణల దాడిని కేవలం మంత్రుల ప్రకటనలకే పరిమితం చేయకుండా, వాస్తవాలను డాక్యుమెంట్ల సహా ప్రజల ముందు ఉంచి కౌంటర్ అటాక్ చేయకపోతే.. దీర్ఘకాలంలో ఇలాంటి చిన్న సైజు స్కామ్ ఆరోపణలే ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

సూరి భగవంతం (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు.

ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు.

బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు.

ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు.

భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్.బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు.

దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

# నాందేడ్‌లో సుఖ్బీర్ సింగ్ బాదల్‌పై కత్తితో దాడి

**ముంబై :** మహారాష్ట్రలోని నాందేడ్‌లో శిరోమణి అకాలీ దళ్ జాతీయ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడి జరిగింది. ఆయన తన కుటుంబంతో కలిసి నాందేడ్‌లోని గురుద్వారా మాతా సాహిబ్ కౌర్‌లో పూజలు చేయడానికి వెళ్లారు. ఒక వ్యక్తి కత్తితో ఆయనపై దాడి చేశాడు. నివేదికల ప్రకారం, బాదల్ చేతికి గాయమైంది. వాగ్వాదం సందర్భంగా సుఖ్‌బీర్‌పై కత్తితో దాడి జరిగినట్లు తెలిసింది. దాడి జరిగిన వెంటనే సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఆయనకు చికిత్స జరుగుతోంది. గురువారం శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ గురుద్వారాకు చేరుకుంటున్న సమయంలో, ఉదయం సుమారు 11:30 గంటలకు ఈ ఘటన జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఒక వ్యక్తి బాదల్ వద్దకు వచ్చి కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో బాదల్ చేయికి గాయమైంది. ఆయన వ్యక్తిగత భద్రతా అధికారి కూడా గాయపడ్డారు. గురుద్వారా ప్రాంగణంలో ఈ ఘర్షణకు ముందు వాగ్వాదం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. బాదల్‌ను తర్వాత వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై నాందేడ్ గురుద్వారా లోపల పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఒక వ్యక్తి దాడి చేశాడని నాందేడ్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. చేతికి గాయం కావడంతో సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన అనంతరం పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఒక భారతీయ రాజకీయవేత్త, వ్యాపారవేత్త. ఆయన ప్రస్తుతం పంజాబ్‌లోని ప్రముఖ రాజకీయ పార్టీల్లో ఒకటైన శిరోమణి అకాలీ దళ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన రెండుసార్లు పంజాబ్ ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. బాదల్ పార్లమెంటులో ఫిరోజ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయన రాజకీయ పలుకుబడి శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ, ఇతర సిక్కు సంస్థలతో కూడా సన్నిహితంగా ముడిపడి ఉంది. శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడిగా, ఆయన పార్టీ రాజకీయ, సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. ఐదుసార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రకాష్ సింగ్ బాదల్ కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పంజాబ్‌లోని అత్యంత ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకదానికి చెందినవారు. ఆయన ఐదుసార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసి, రాష్ట్రంలో అత్యధిక కాలం పనిచేసిన రాజకీయ నాయకుల్లో ఒకరైన ప్రకాష్ సింగ్ బాదల్ కుమారుడు. బాదల్ కుటుంబం శిరోమణి అకాలీ దళ్, పంజాబ్ రాజకీయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. చివరికి సుఖ్‌బీర్ తన తండ్రికి ప్రధాన రాజకీయ వారసుడిగా ఎదిగి, పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ జూలై 9, 1962న పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లో ఒక ధిల్లాన్ జాట్ సిక్కు కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లి సురీందర్ కౌర్. ఆయన తన ప్రాథమిక విద్యను సనావర్‌లోని ది లారెన్స్ స్కూల్‌లో అభ్యసించారు. ఆ తర్వాత బాదల్ చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి, అక్కడ 1980, 1984 మధ్య అర్థశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. తదనంతరం ఆయన ఉన్నత విద్య కోసం యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లి, లాస్ ఏంజిల్స్‌లోని కాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. బాదల్ తన రాజకీయ జీవితంలో ఎస్ఏడీలో క్రమంగా ఎదుగుతూ వచ్చారు. ఆయన రెండుసార్లు పంజాబ్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన ఫిరోజ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా కూడా పనిచేశారు, తద్వారా జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో బలపడుతూ వచ్చారు. ఎస్ఏడీ అధ్యక్షుడిగా, ముఖ్యంగా పంజాబ్‌లో తీవ్రమైన రాజకీయ పోటీ ఉన్న సమయాల్లో, బాదల్ పార్టీ వ్యూహాలు, నిర్ణయాల రూపకల్పనలో కేంద్ర బిందువుగా నిలిచారు. అయితే, బాదల్ నాయకుడిగా ఉన్న కాలంలో పార్టీ ఎన్నికల భవిష్యత్తుకు గణనీయమైన ఎదురుదెబ్బ తగిలింది. శిరోమణి అకాలీ దళ్, ముఖ్యంగా 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పంజాబ్‌లో తన ఎన్నికల్లో ఘోరమైన పతనాన్ని చవిచూసింది. పార్టీ ప్రత్యర్థి రాజకీయ శక్తుల చేతిలో పట్టు కోల్పోయింది. రాష్ట్ర ఎన్నికల రంగంలో దాని స్థానం గణనీయంగా బలహీనపడింది. గతంలో పంజాబ్ రాజకీయాల్లో ఆధిపత్య శక్తుల్లో ఒకటిగా ఉన్న సంస్థకు ఈ పతనం ఒక పెద్ద మార్పును సూచించింది.

# మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

**మహబూబ్ నగర్, :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది. దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు. పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

# తెలంగాణలోనూ మఖానా సాగు



**హైదరాబాద్, :** వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బిహార్ ఆసక్తి చూపగా.. బిహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది. ఈ మేరకు బిహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బిహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025?26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బిహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు. మరోవైపు బిహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బిహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బిహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బిహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

# ఓటుకు నోటు కేసులో స్పెషల్ బెంచ్



న్యూఢిల్లీ, : కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో.. పకడ్బందీ ప్రణాళికతో.. ఏసీబీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో వారు అప్పటి టిడిపి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిని పట్టుకున్నారు. ఓటుకు నోటు కేసులో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రకే పరిమితం కావలసి వచ్చింది. నాడు జరిగిన ఈ సంఘటన తెలంగాణ రాజకీయాలను సమూలంగా మార్చేసింది. నాడు నమోదైన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అనేక ప్రకంపనాలను సృష్టించింది. చివరికి ఈ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను మళ్లీ మొదటికి తీసుకువచ్చింది. గతంలో ఈ కేసును ధర్మాసనం విచారించింది. తీర్పును రిజర్వ్ చేసింది.. అనేక రకాలుగా వాదనాల విన్న ఈ ధర్మాసనంలోనే న్యాయమూర్తులు ఇటీవల పదవి విరమణ చేశారు. నిబంధనల ప్రకారం చూసుకుంటే ఈ కేసు వాదనలను మళ్లీ మొదటి నుంచి వినాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరించారు. ఈ క్రమంలో ఈ కేసు మళ్లీ విచారణకు వస్తుందని సమాచారం. పది సంవత్సరాల క్రితం ఓటుకు నోటు కేసు నమోదయింది. నాడు ఈ కేసు పై నమోదైన పిటిషన్ల పై సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా విచారణ కొనసాగింది. ఈ వాదనలను విన్న ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఫలితంగా సాంకేతిక కారణాల నేపథ్యంలో విచారణ కొంత పరిధిలో ఆగిపోయింది. రోస్టర్ ప్రక్రియలో భాగంగా ఈ కేసు ఇటీవల సీజేఐ ముందుకు వచ్చింది. న్యాయ ప్రక్రియ.. ఇతర నియమాల నేపథ్యంలో పాత వాదనలను తాము లెక్కలోకి తీసుకోలేమని సూర్యకాంత వివరించారు. ఈ ప్రకారం కొత్త బెంచ్ ఈ కేసును విచారించాల్సి ఉంటుంది. ఈ కేసులో మొదటి నుంచి వాదనలు వింటామని సిజెఐ ప్రకటించారు. మరోవైపు ఈ కేసు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్నది. అందువల్ల దీనిని వేగంగా విచారించడానికి ప్రత్యేకమైన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సిజెఐ వెల్లడించారు. నూతన ధర్మసనం ఏర్పాట తర్వాత..

వాదులు.. ప్రతిభాదులు తరపున న్యాయవాదులు మళ్లీ తమ వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఇన్నాళ్లపాటు ఈ కేసులో ఎటువంటి కదలిక లేదు. ఈ క్రమంలో ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం రీ హియరింగ్ కు వస్తున్నా మని సంకేతాలు ఇవ్వడంతో.. పొలిటికల్ గా హీట్ పెరిగింది. ఈ కేసు సంబంధించి మీడియా నుంచి అనేక రకాలుగా ప్రస్తుతం ముఖ్యమంత్రి కి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ ప్రశ్నలకు ఆయన నేరుగాని సమాధానం చెప్పారు. తనను ఏ విధంగా ఇరికించారు.. దాని వెనుక ఉన్న మనుషులు ఎవరు.. వారి ప్రయోజనాలు ఏంటి అనే విషయాలను రేవంత్ రెడ్డి అనేక పర్యాయాలు వివరించారు. ఈ కేసు కు సంబంధించి తనలో ఎటువంటి ఆందోళన లేదని.. తీర్పు తనకు అనుకూలంగానే వస్తుందని అనేక సందర్భాల్లో రేవంత్ చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు ఈ కేసు మళ్ళీ వస్తున్న నేపథ్యంలో.. రేవంత్ వర్గీయులు పెద్దగా ఆందోళన చెందడం లేదు. కంగారు పడడం లేదు. నాటి ప్రభుత్వం ఏకపక్షంగా ఈ కేసు నమోదు చేసిందని.. ఇందులో స్థాయికి మించి వ్యవహరించిందని.. పొలిటికల్ గా రేవంత్ రెడ్డికి నష్టం చేయాలని చూశారని.. చివరికి వారే నష్టపోయారని రేవంత్ రెడ్డి వర్గీయులు అంటున్నారు.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

**హైదరాబాద్,** : రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది. కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.


# ఈ కేవైసీకి మరో రోజే....

**హైదరాబాద్,** : దేశవ్యాప్తంగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సింది. అయితే ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఇప్పటి వరకు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ ఫోన్ నుంచి ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈ-కేవైసీ చేసుకునే సదుపాయాన్ని చమురు కంపెనీలు కల్పిస్తున్నాయి. ఎల్‌పీజీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా? అనే విషయాన్ని ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడం ఈ-కేవైసీ ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వం గతంలో స్పష్టం చేసిన ప్రకారం.. ఈ ప్రక్రియను డెలివరీ సిబ్బంది ద్వారా, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత కంపెనీ మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు. మొబైల్ ద్వారా ఈ-కేవైసీ చేయాలంటే మీ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇండేన్ వినియోగదారులు 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్, భారత్ గ్యాస్ వినియోగదారులు 'హలో బీపీసీఎల్', హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు 'హెచ్ పీ పే' యాప్‌ను ఉపయోగించవచ్చు. వీటితో పాటు ముఖ గుర్తింపు ద్వారా ఆధార్ ధ్రువీకరణ కోసం 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ అవసరం అవుతుంది. ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు అయితే ముందుగా 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్‌ను ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత 'ఈ కేవైసీ' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అవసరమైన వివరాలను పరిశీలించిన తర్వాత నిబంధనలకు అంగీకారం తెలిపి ఫేస్ స్కాన్




ప్రారంభించాలి. ఆ సమయంలో 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ తెరుచుకుంటుంది. స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటిస్తూ కెమెరా ముందు ముఖాన్ని చూపిస్తే ఫేస్ అథెంటికేషన్ పూర్తవుతుంది. అనంతరం ఈ-కేవైసీ అభ్యర్థనను సబ్మిట్ చేయాలి. మిగతా గ్యాస్ వినియోగదారులు కూడా ఇలాగే పూర్తి చేసుకోవచ్చు. ఫేస్ అథెంటికేషన్ సమయంలో మొబైల్ కెమెరా స్పష్టంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖంపై ఎక్కువగా నీడ పడకుండా తగిన వెలుతురు ఉండాలి. కెమెరా ముందు ముఖాన్ని సరిగ్గా ఉంచి స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటించాలి. ఆధార్ బయోమెట్రిక్స్ లాక్ చేసి ఉంటే అథెంటికేషన్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే ఎల్ పీజీ కనెక్షన్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు సరిగ్గా ఉండటం కూడా ముఖ్యమే. ఈ-కేవైసీ గడువుపై ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన తేదీలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 16 ఆగస్టు 2026 తేదీలను పేర్కొంటున్నారు. అయితే దీనిపై సంబంధిత డీలర్ ను సంప్రదించడం మంచిది.

# యోగి బాటలో సువేందు



**కోల్ కత్తా,** : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు. ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు. ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

# సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ,** : కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి. ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి

**హైదరాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార



కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

**హైదరాబాద్,** : తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమెటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

# ఎన్టీఆర్ కు 6 నుంచి 8 వారాల రెస్ట్

హైదరాబాద్, : మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ భుజానికి డాక్టర్స్ విజయవంతంగా సర్జరీ పూర్తి చేశారు. జులై 27న జిమ్‌లో ఎక్సర్ సైజ్ చేస్తున్న టైంలో భుజానికి గాయం కాగా వైద్యుల సూచన మేరకు ఆయన సర్జరీ చేయించుకున్నారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జె.మధూసూదన్ రావు, డాక్టర్ ఆర్ఏ పురంచంద్ర తేజస్వి నేతృత్వంలో వైద్యుల బృందం ఆయనకు సక్సెస్ ఫుల్‌గా సర్జరీ కంప్లీట్ చేసింది. ప్రస్తుతం ఎన్టీఆర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని... ఆయనకు 6 నుంచి 8 వారాల రెస్ట్ అవసరమని వైద్యులు సూచించారు. ఆ తర్వాతే ఆయన షూటింగ్స్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. తొలుత ఈ ఇంజ్యూరీ ఎలాంటి సర్జరీ అవసరం లేకుండానే నయం అవుతుందని భావించారు. అయితే, రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా డాక్టర్ల సూచన మేరకు ఎన్టీఆర్ సర్జరీ చేయించుకోనున్నట్లు తెలుస్తోంది. ఆయన త్వరగా కోలుకోవాలని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తిరిగి షూటింగుల్లో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నారు. ఎన్టీఆర్ ప్రస్తుతం స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ ఎంటర్టైనర్ డ్రాగన్ మూవీ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఓపియమ్మల్లమందు సాగు, డ్రగ్స్ బేస్ట్ స్టోరీతో పాటు ముంబై అండర్ వరల్డ్ మాఫియా, ఆసియా దేశాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా మూవీని రూపొందించినట్లు గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా సాగుతోందిఈ మూవీలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

# గ్రాఫిక్స్ నిజం చేశాము

# తెలుగు జాతి గర్వపడేలా నిర్మాణం

**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక మైలురాయిగా భావిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ వేడుక తెలుగుజాతి ఆత్మ గౌరవానికి, అభివృద్ధికి నిదర్శనమని చంద్రబాబు అన్నారు. ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు కాలినడకన స్టీల్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవం తర్వాత ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నిర్మాణ ఆవశ్యకతను, తన విజన్‌ను వివరించారు. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సె? అని ఆయన అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్? సైబరాబాద్ నిర్మాణం ఏ విధంగా తెలుగుజాతి గర్వపడేలా జరిగిందో, అమరావతిని కూడా అదే స్థాయిలో నిర్మించాలన్నదే తన సంకల్పమని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని సరైన రాజధాని కూడా లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాం: చంద్రబాబు

25 పార్లమెంట్ స్థానాలకు మధ్యలో గుంటూరు జిల్లాలో ఈ ప్రాంతం ఉండటం వల్లే ఇక్కడ రాజధాని నిర్మించాలని నిర్ణయించినట్టు ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం ఒక చోట కేంద్రీకరించడం కాదని, అమరావతితోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి ఫలాలను వికేంద్రీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం వివరించారు. అమరావతి ప్రయాణం సాఫీగా సాగలేదని, ఐదేళ్ల పాలనలో ఎదురైన సవాళ్లను సీఎం గుర్తు చేశారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ చంద్రబాబు పాదాభివందనం చేశారు. 2019–24 మధ్య జరిగిన రైతుల ఉద్యమాన్ని చరిత్ర ఎప్పటికీ మర్చిపోదని ఆ సమయంలో తాము కూడా జోలె పట్టి రైతులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. అమరావతి బృహత్ ప్రణాళిక కోసం సింగపూర్ ప్రభుత్వం పూర్తిగా సహకరించిందని, అయితే గత పాలకులు వారిని వేధింపులకు గురి చేశారని ఆయన విమర్శించారు. రాజధాని భవనాలు యూనీక్‌గా ఉండాలని లండన్‌కు చెందిన నార్మన్ ఫాస్టర్స్‌తో డిజైన్లు చేయించామని, అయితే కొందరు వీటిని గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారని చంద్రబాబు గుర్తు చేశారు. ఇప్పుడు ఆ గ్రాఫిక్స్ నిజమవుతుంటే విమర్శించిన వారు తలదించుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణానికి దేశంలోని పవిత్ర నదుల నీరు, మట్టిని తెప్పించి కలిపామని, తిరుమల తర్వాత అంతటి విశిష్టమైన శ్రీవారి ఆలయం అమరావతిలో ఉండాలని తాను ఆకాంక్షించినట్టు తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ కావాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిని కేవలం కాంక్రీట్ జంగిల్‌గా కాకుండా, అత్యంత అహ్లాదకరమైన, పర్యావరణ హితమైన నగరంగా తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో పనులు మరింత వేగంగా జరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం 'గ్రాఫిక్స్' అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు.

రైతుల ఉద్యమం చారిత్రాత్మకం

అమరావతి కోసం రైతులు చేసిన పోరాటాన్ని చంద్రబాబు కొనియాడారు. "చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఉద్యమం ఏదైనా ఉందంటే అది అమరావతి రైతుల ఉద్యమమే. మీరు పడిన కష్టాలు




నేను కళ్లారా చూశాను. మీకు అండగా నిలవడానికి పార్టీ ఖాతాలో డబ్బులు లేని సమయంలో నేను జోలె పట్టి డబ్బులు వసూలు చేసి న్యాయపోరాటానికి సహకరించాను. నా భార్య సైతం తన చేతి గాజులు తీసి ఉద్యమానికి విరాళంగా ఇచ్చింది. అలాంటి మీ త్యాగాల పునాదులపైనే ఈ రాజధాని మళ్లీ నిలబడుతోంది. మీ పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చిన్న చిన్న న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి ప్రాజెక్టును ఆపాలని చూసినా, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని హైకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అదొక అద్భుతమైన భవిష్యత్ దర్శనమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాలతో దీనిని నిర్మించనున్నట్లు తెలిపారు.

1. నో పోల్స్ సిటీ: రోడ్లపై కరెంట్ స్తంభాలు, వైర్లు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డక్ట్ వ్యవస్థ.
2. బ్లూ సిటీ: కృష్ణా, గోదావరి జలాలతో నగరం మొత్తం నీటి వనరులతో కళకళలాడటం.
3. గ్రీన్ సిటీ: 50 శాతానికి పైగా పచ్చదనంతో, అత్యుత్తమ జీవవైవిధ్యంతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపడం.
4. గ్రీన్ ఎనర్జీ: సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలతో 'నెట్ జీరో కార్బన్' నగరంగా తీర్చిదిద్దడం. 5. నాలెడ్జ్ ఎకానమీ: డీప్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, ఉన్నత విద్యాసంస్థలతో విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మార్చడం. ఈ ఐదు సూత్రాలతో అమరావతిని భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోని టాప్–5 రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్‌నిర్మించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిస్వార్థంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈరోజు వేసింది మొదటి అడుగేనని, ఇకపై అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్ప సిద్ధికి కేంద్రంగా అమరావతి నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 2047 నాటికి భారతదేశం వికసిత భారత్‌గా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఈ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఒక్కరూ '... అనే నేను' (మీ పేరు చెప్పుకుని) అని ఒక సంకల్పం తీసుకోవాలి. మీ అభివృద్ధి, మీ కుటుంబం, మీ రాష్ట్రం, మీ దేశంకోసం ఏం చేస్తారో ప్రతిజ్ఞ చేయాలి. ఆ సంకల్పాన్ని ప్రతిరోజూ గుర్తుచేసుకుంటూ పనిచేయాలి. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడం అంటే యుద్ధాలు చేయడం కాదు. రైతు బాగా పంట పండిస్తే, విద్యార్థి బాగా చదువుకుంటే, ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో రాణిస్తే అదే నిజమైన దేశభక్తి" అని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, తిరంగా ర్యాలీలతో స్ఫూర్తిని నింపాలని కోరారు. ముఖ్యమంత్రి తన ప్రసంగం చివర్లో, ఈ రహదారి ప్రారంభోత్సవం అభివృద్ధి ప్రస్థానంలో తొలి అడుగు మాత్రమేనని, ఇక్కడి నుంచి ప్రతి రోజూ అమరావతి నిర్మాణం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్న రైతులు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతాకీ జై, తెలుగు తల్లికి జై, జై అమరావతి" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీఆర్‌డీఏ అధికారులు, వేలాది మంది అమరావతి రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలకు కౌంట్ డౌన్



**విజయవాడ,** : రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల నిర్వహణ దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ప్రకటనతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, జనసేన, వైసీపీ, బీజేపీ అప్పుడే తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నెం. 401/రాఇఅ–ఈ1/2026–1ను విడుదల చేస్తూ, రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల ప్రక్రియకు ప్రాథమిక అడుగు వేసింది. ఈ నోటిఫికేషన్ ప్రధాన ఉద్దేశ్యం పట్టణ ప్రాంతాల్లో పారదర్శకమైన, తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం. రాజ్యాంగబద్ధంగా గడువు ముగియనున్న లేదా ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు కార్పొరేటర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ కసరత్తు సాగుతోంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 3 సెప్టెంబర్ 2026 రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురించనున్నారు. ఈ జాబితా తయారీకి 1 జనవరి 2026ను ప్రామాణికంగా తీసుకున్నారు. అంటే తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు. భారత ఎన్నికల సంఘం ఇటీవల అసెంబ్లీ నియోజకవర్గాల కోసం రూపొందించిన తాజా ఓటర్ల డేటాను ప్రాతిపదికగా తీసుకొని, దానిని మున్సిపల్ వార్డుల వారీగా విభజిస్తారు. ఓటర్ల జాబితాల తయారీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఎన్నికల సంఘం పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని కార్పొరేషన్లలో వార్డుల వారీ జాబితాలను సిద్ధం చేయడం, క్షేత్రస్థాయిలో పోలింగ్ స్టేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవడం వీరి ప్రధాన బాధ్యత. రాష్ట్రంలోనే అతి పెద్దదైన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కోసం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. విశాఖ నగర విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని, జోనల్ కమిషనర్లకు తమ పరిధిలోని వార్డుల జాబితాలను ప్రచురించే అధికారాలను కల్పించారు. దీని వల్ల పరిపాలనా సౌలభ్యం పెరగడమే కాకుండా, ఓటర్లకు ఫిర్యాదు చేసే ఛాన్స్ ఈజీ అవుతుంది. సెప్టెంబర్ 3న విడుదలయ్యే జాబితా కేవలం ఓటర్ల పేర్ల కోసం మాత్రమే కాదు, అది ఎన్నికల రిజర్వేషన్ల దిశను నిర్ణయిస్తుంది. వార్డుల వారీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల లెక్కల ఆధారంగానే ప్రభుత్వం రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లను ప్రకటిస్తుంది. మేయర్ పీఠం ఏ వర్గానికి దక్కుతుంది, ఏ వర్గం పోటీ చేయాలి, అన్నది ఈ డేటాపైనే ఆధారపడి ఉంటుంది. రిజర్వేషన్లు ఖరారు అయితే తప్ప రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉండదు. అందుకే అటువంటి ఆశావాహులు, ఇటు పార్టీ అధిష్ఠానాలు ఈ జాబితా కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఓటర్లకు సూచనలు గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఓటర్ల పేర్లు గందరగోళానికి గురి కాకుండా ఉండటానికి ఈ సారి టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్నారు. అసెంబ్లీ ఓటర్ల జాబితాలోని డేటాను నేరుగా మున్సిపల్ వార్డుల మ్యాపింగ్‌కు అనుసంధానించం వల్ల డూప్లికేట్ ఓట్లకు అడ్డుకట్ట పడనుంది. సెప్టెంబర్ 3న జాబితా విడుదలైన వెంటనే ప్రతి ఒక్కరూ తమ వార్డు పరిధిలోని మున్సిప్ కార్యాలయంలో లేదా అధికారిక రాఇఅ వెబ్‌సైట్‌లో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలి.

# గ్రేటర్ పోరులో పార్టీలు...

హైదరాబాద్, : తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు. ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు



ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి


# ఏనుగులు జీవన వైవిధ్యానికి అవసరం



**విశాఖపట్టణం,** : ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ–ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ–ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# కేసీఆర్ అన్నం పెట్టారు

**నిజామాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు డాక్టర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కాంగ్రెస్ గూటికి చేరిన ఆయన, పాత స్నేహాన్ని గుర్తు చేసుకుంటూనే ప్రస్తుత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం మంజీరా చెక్ డ్యాం వద్ద నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం? ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పోచారం శ్రీనివాస్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల తనకున్న కృతజ్ఞతను బహిరంగంగానే చాటుకున్నారు. అన్నం పెట్టిన వారిని మిచిపోలేం అంటూ ఆయన చేసిన వ్యాఖ్య రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తన నియోజకవర్గమైన బాన్సువాడలో జరిగిన అభివృద్ధి అంతా కేసీఆర్ హయాంలోనే జరిగిందన, ఆ వాస్తవాన్ని చెప్పడానికి తాను ఏ మాత్రం వెనుకబాడబోనని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం తనకు ఇష్టం లేదని, కానీ నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అనివార్య రాజకీయ పరిస్థితులు, ఇబ్బందులు వల్లే తాను కాంగ్రెస్‌తో చేతులు కలపాల్సి వచ్చిందని వివరించారు. తాను కేవలం నియోజకవర్గ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఏనాడు డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు. పోచారం కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందనే అంశంపై క్లారిటీ ఇచ్చారు. దాదాపు రెండేళ్ల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఇంటికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడించారని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి స్వయంగా తన నివాసానికి వచ్చి, ఆరు నెలల కాలంలో నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందనే ఏకైక ఆశతోనే తాను రేవంత్ రెడ్డికి మద్దతు ప్రకటించానని, కేవలం అభివృద్ధి కోసమే ఆనాడు తాను మూడు రంగుల జాతీయ కండువాను కప్పుకున్నానని ఆయన వెల్లడించారు. తాను పదవుల కోసమో, ఆర్థిక ప్రయోజనాల కోసమో పార్టీ మారలేదని,



నియోజకవర్గ ప్రజల కోసమే ఈ అడుగులు వేశామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తనకు గౌరవం ఉన్నప్పటికీ, ప్రభుత్వంలోని మంత్రుల తీరుపై పోచారం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఇప్పటికే నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా తాను ఒక సీనియర్ ఎమ్మెల్యేగా, ప్రభుత్వం సలహాదారుగా ఉండి ఫోన్ చేసిన మంత్రులు తన కాల్స్ ఎత్తడం లేదని ఆయన బహిరంగంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పినా మంత్రులు నా మాట వినడం లేదు అని ఆయన వ్యాఖ్యానించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత సమన్వయ లోపాన్ని ఎత్తి చూపుతోంది. ఈ కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల నియోజకవర్గంలో పనులు కుంటుపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రుల సహకారం లేకపోవడం, నిధుల విడుదలలో జాప్యం జరగడం వల్ల బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు సగంలోనే నిలిచిపోయాయని పోచారం తెలిపారు. గతంలో ప్రారంభమైన పనులకు బిల్లులు రాకోవడంతో కాంట్రాక్టర్లు పనులను పక్కన పెట్టేశారని, ఇది ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని ఆయన వివరించారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడటం తన నైజామని, రాజకీయ రహస్యాలు ఏవీ తన మాటాల్లో లేవని ఆయన స్పష్టం చేశారు.

# స్టే ఉన్నా భవనాలు కూల్చేస్తారా

హైదరాబాద్ : కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్తులను కూల్చివేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ధిక్కరణ చర్యలను సుమోటోగా స్వీకరించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మండలంలోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో (సర్వే నెం. 194/1, 211) కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి, తిరుమలగిరి తహసీల్దార్లు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 కూల్చివేతలు చేపట్టిందని కలెక్టర్ న్యాయస్థానానికి నివేదించారు. దీనిపై హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ, రెవెన్యూ శాఖ సూచనల మేరకే జీఎల్‌ఆర్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అయితే, సరైన రికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ వద్ద ఉన్న కోర్టు స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

# హోర్ముజ్‌ను తెరవనున్న ఇరాన్‌ తగ్గుముఖం పట్టిన అంతర్జాతీయ చమురు ధరలు

హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణాను పునఃప్రారంభించేందుకు ఒమన్‌తో మధ్యంతర ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ఇరాన్ ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు స్వల్పంగా తగ్గాయి.
హోర్ముజ్ జలసంధిలో సార్వభౌమాధికారాన్ని కాపాడుతూ, అమెరికా ఒత్తిడిని ఎదుర్కొంటూనే నౌకాయానాన్ని పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఇరాన్ తెలిపింది. గురువారం ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 37 సెంట్లు లేదా 0.5 శాతం తగ్గి 79.08 డాలర్లకు చేరుకోగా, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ధర 53 సెంట్లు లేదా 0.7 శాతం క్షీణించి 74.69 డాలర్ల వద్ద ట్రేడైంది.
మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకునే అవకాశాలపై పెట్టుబడిదారుల్లో ఆశావహ వాతావరణం నెలకొనడంతో చమురు సరఫరాపై ఉన్న ఆందోళనలు కొంత మేర తగ్గాయి.
దీంతో అంతర్జాతీయ చమురు ధరలు స్వల్పంగా దిగివచ్చాయి. అయితే మరోవైపు, ఐరోపాలో కొనసాగుతున్న తీవ్ర వడగాలులు, కరువు పరిస్థితులు ఇంధన రంగంపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా రిఫైనరీల కార్యకలాపాలు అంతరాయం కలుగుతున్నాయని, దీనివల్ల ఇంధన ఉత్పత్తి సామర్థ్యం తగ్గే అవకాశాలు ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.




# ఎనర్జీ స్టోరేజ్‌లో యాక్సిస్ ఎనర్జీతో ఓలా కీలక ఒప్పందం




దేశీయ క్లీన్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేస్తూ, 2032 నాటికి 20 గిగావాట్ అవర్స్ సామర్థ్యం గల 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' (బీఈఎస్ఎస్)ను ఏర్పాటు చేయడానికి ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ 'యాక్సిస్ ఎనర్జీ'తో కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆగస్టు 15న అధికారికంగా ప్రారంభం కానున్న ఓలా తొలి ఎనర్జీ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్ 'ఓలా మహాశక్తి'కి లభించిన మొదటి అతిపెద్ద వ్యాపార మైలురాయి ఇది.
సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనాల ప్రకారం 2032 నాటికి దేశంలో 400 గిగావాట్ అవర్స్‌కు పైగా ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్యం అవసరం కానుండగా, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలో 3,750 మెగావాట్లకు పైగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు నిర్మిస్తున్న యాక్సిస్ ఎనర్జీకి ఈ స్వదేశీ బీఈఎస్ఎస్ సాంకేతికత ఎంతో కీలకం కానుంది. ఓలా ఛైర్మన్ భవిష్ అగర్వాల్, యాక్సిస్ ఎనర్జీ ఎండీ రవి కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో కుదిరిన ఈ భాగస్వామ్యం ద్వారా సెల్ తయారీ నుండి సిస్టమ్ ఇంజనీరింగ్ వరకు పూర్తిస్థాయి టెక్నాలజీతో తక్కువ ఖర్చుకే నిరంతరాయమైన, నమ్మకమైన స్వచ్ఛమైన విద్యుత్ సరఫరాను గ్రిడ్లు, డేటా సెంటర్లు, పరిశ్రమలకు అందించవచ్చని కంపెనీలు వెల్లడించాయి.

# ఎయిర్‌టెల్ రీ'ఛార్జ్' మరింత భారం..రూ.299 బేసిక్ ప్లాన్ ఎత్తివేత




ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా వినియోగదారులపై భారాలను మోపుతున్నాయి. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ వినియోగదారులపై గతేడాది టారిఫ్ ధరలను పెంచగా తాజాగా తన బేసిక్ ప్లాన్ రూ.299 పూర్తిగా నిలిపివేసింది. అధికారిక వెబ్‌సైట్ అలాగే ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ నుంచి ఈ ప్లాన్‌ను తొలగించడంతో వినియోగదారులపై మరింత ఆర్థిక భారం పడినట్లయింది. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న రూ.299 ప్లాన్ ద్వారా 28 రోజుల వ్యాలిడిటీతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 1 జిబి డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు, పెర్‌ప్లెక్సిటీ ప్రో ఎఐ సబ్‌స్క్రిప్షన్ లభించేవి. ఈ ప్లాన్ రద్దుతో ఇప్పుడు ఎయిర్‌టెల్‌లో కనీస రీఛార్జి ధర రూ.349కి చేరింది. రూ.349 ప్లాన్‌లో 28 రోజుల పాటు అపరిమిత కాల్స్, రోజుకు 1.5 జిబి డేటా, అన్‌లిమిటెడ్ 5జి డేటాతో పాటు యాపిల్ మ్యూజిక్, ఎయిర్‌టెల్ ఎక్స్ స్ట్రీమ్ ప్లే ప్రయోజనాలు వర్తిస్తాయని కంపెనీ వెల్లడించింది. మరోవైపు కేవలం రూ.299 ప్లాన్ మాత్రమే కాకుండా మరికొన్ని దీర్ఘకాలిక ప్లాన్లపై కూడా ఎయిర్‌టెల్ కోత విధించినట్లు తెలుస్తోంది.
ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సర్కిల్స్‌లో రూ.579, రూ.619 ప్రీపెయిడ్ ప్లాన్లను కూడా తొలగించినట్లు సమాచారం. త్వరలోనే ఈ నిలిపివేత ప్రక్రియను దేశవ్యాప్తంగా ఇతర టెలికాం సర్కిళ్లకూ విస్తరించే అవకాశం ఉందని తెలుస్తోంది.
ఆర్థిక సంవత్సరం 2026-27 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారతి ఎయిర్‌టెల్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఏకంగా 37.3 శాతం పెరిగి రూ.8,167 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 18.4 శాతం వృద్ధితో రూ.58,539 కోట్లకు పెరిగింది. సగటు వినియోగదారుడి నుంచి ఆదాయం (ఎఆర్‌పియు) రూ.250 నుంచి రూ.264కు పెరగడం కంపెనీ లాభాలను మరింత పెంచింది. అయినప్పటికీ వినియోగదారులపై వరుస భారాలను మోపడం గమనార్హం.


# రాఖీకి ప్రత్యేక ఆఫర్లతో డిమార్ట్‌కు క్యూ కడుతున్న మహిళలు




ఇంట్లో పప్పులు నిండుకున్నాయి.. డీ మార్ట్ వెళ్లాలి. ఇంట్లో వంట నూనె దగ్గర పడింది డీ మార్ట్ కు వెళ్లాలి. ఇలా పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ మాట్లాడుకుంటారు. ఎందుకంటే డీమార్ట్ వీరినే టార్గెట్ చేసింది. తక్కువ ధరలో నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు అందిస్తున్న డీమార్ట్ తక్కవ కాలంలో బహుళ ప్రాచుర్యం పొందింది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడతో పాటు చాలా పట్టణాల్లో డీ మార్ట్ స్టోర్లు అందుబాటులోకి వచ్చాయి. ఎప్పుడు వెళ్లిన డీమార్ట్ స్టోర్లు రద్దీగా కనిపిస్తాయి. జనాలకు అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం, తక్కువ ధర ఉండడం వల్ల డీమార్ట్ వెళ్తున్నారని చెబుతున్నారు. రాఖీ పండుగా సందర్భంగా డీమార్ట్ స్పెషల్ స్వీట్లు, రాఖీలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలుస్తోంది. స్టోర్ లో రాఖీలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో ఆకర్షణీయమైన రాఖీలు, రకరకాల డిజైన్ల రాఖీలు అందుబాటులోకి తెచ్చారు. కార్టూన్ థీమ్ రాఖీలు కూడా ఉన్నాయి. అంతే కాకుండా ఈ నెలలో వరలక్ష్మి వ్రతం ఇందుకు సంబంధించిన పూజా సామాగ్రి కూడా కొనుగోలు చేస్తున్నారు. కాగా మొట్టమొదటి డీ మార్ట్ స్టోర్ ను ఓనర్ రాధా కిషన్ దమానీ ముంబైలో 2002 లో ప్రారంభించారు. కంపెనీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10 రాష్ట్రాలలో 415 స్టోర్లను నిర్వహిస్తూ, రూ.57,790 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.
జనాలకు అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం, తక్కువ ధర ఉండడం వల్ల డీమార్ట్ వెళ్తున్నారని చెబుతున్నారు. రాఖీ పండుగా సందర్భంగా డీమార్ట్ స్పెషల్ స్వీట్లు, రాఖీలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలుస్తోంది.
స్టోర్ లో రాఖీలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో ఆకర్షణీయమైన రాఖీలు, రకరకాల డిజైన్ల రాఖీలు అందుబాటులోకి తెచ్చారు. రాధా కిషన్ దమానీ మొదటి సూత్రం తక్కువ ఖర్చుతో స్టోర్లు ఏర్పాటు చేయడం.
అందుకే ఏ డిమార్ట్ స్టోర్‌లోకి అడుగుపెట్టినా మెరిసే మార్బుల్ ఫ్లోర్లు ఉండవు, ఫ్యాన్సీ డిజైనర్ ఫిక్చర్లు ఉండవు, లైటింగ్ చాలా సాదాసీదాగా ఉంటుంది. ఫ్యూచర్ గ్రూప్‌కు చెందిన బిగ్ బజార్ వంటి ప్రత్యర్థులు ఖరీదైన మాల్స్‌లో దీర్ఘకాలిక లీజులను ఎంచుకోగా, దమానీ భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నారు. డిమార్ట్ తన స్టోర్లను చాలా వరకు సొంత భవనాల్లోనే ఏర్పాటు చేశారు.

# దేశంలో అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్‌గా గూగుల్

రాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్ఈబీఆర్)-2026 నివేదిక ప్రకారం, దేశంలో అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ బ్రాండ్‌గా గూగుల్ అగ్ర స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో టాటా గ్రూప్, అమెజాన్ నిలిచాయి. టాప్-10 జాబితాలో శాంసంగ్ ఇండియా, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ గ్రూప్, హిందుస్థాన్ యూనిలివర్, మహీంద్రా అండ్ మహీంద్రా, డెల్ టెక్నాలజీస్ కూడా చోటు దక్కించుకున్నాయి. 34 దేశాల్లోని 1.75 లక్షల మందికి పైగా, భారత్‌లో దాదాపు 3,500 మంది ఉద్యోగుల అభిప్రాయాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదికలో మరో కీలక అంశం కూడా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో 46 శాతం మంది ఉద్యోగులు వచ్చే ఆరు నెలల్లో ఉద్యోగం మార్చాలని యోచిస్తుండగా, 32 శాతం మంది ఇప్పటికే గత ఆరు నెలల్లో ఉద్యోగం మార్చినట్లు సర్వే వెల్లడించింది. ఉద్యోగులు కంపెనీని ఎంపిక చేసుకునేటప్పుడు పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత, సమాన అవకాశాలు, కెరీర్ వృద్ధి, మంచి జీతభత్యాలు, సంస్థ ప్రతిష్ఠ వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నివేదిక తెలిపింది. ముఖ్యంగా డిజిటల్ రంగ ఉద్యోగులు మాత్రం వర్క్-లైఫ్ బ్యాలెన్స్ కంటే పోటీ స్థాయిలో వేతనానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని,





కెరీర్‌లో పురోగతి కనిపించకపోతే ఉద్యోగం మారేందుకు వెనుకాడరని పేర్కొంది. రాండ్‌స్టాడ్ ఇండియా ఎండీ నారాయణ్ అయ్యర్ మాట్లాడుతూ, ప్రతిభను ఆకర్షించడం మాత్రమే కాదు, దీర్ఘకాలం నిలబెట్టుకోవాలంటే సంస్థలు ఉద్యోగుల అంచనాలకు అనుగుణంగా తమ ప్రతిభ నిర్వహణ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. వృద్ధి అవకాశాలు, సౌకర్యాలు, న్యాయమైన పని సంస్కృతి, మంచి వేతనం, స్పష్టమైన కెరీర్ మార్గం కల్పించగల సంస్థలే ముందంజలో నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

# బంగారం మళ్లీ పరుగులు.. ఒక్కరోజులో రూ. 2,300 జంప్



దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. కొంతకాలంగా స్థిరంగా ఉన్న ధరలు బుధవారం మరోసారి పెరిగాయి. స్పాట్ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో పాటు స్పెక్యులేటర్లు కొత్త కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగడం, ద్రవ్యోల్బణ భయాలతో బంగారంతో పాటు వెండికి గిరాకీ ఏర్పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,580 రూ.1,44,463కు చేరింది. మార్కెట్‌లో అనూహ్యంగా కొనుగోళ్ల ఊపు పెరగడం వల్లే ధరలు వేగంగా పెరిగాయని విశ్లేషకులు తెలిపారు. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి రూ. 2,290 పెరిగి రూ. 1,46,510కి చేరింది.
ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 2,100 పెరిగి రూ. 1,34,300గా ఉంది. వెండి కూడా రూ. 5,000 పెరగడంతో కిలో రూ. 2.45 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా బంగారం ధర 1.23 శాతం పెరిగి ఔన్స్‌కు 4,127.3 అమెరికన్ డాలర్లకు చేరింది. స్పాట్ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో పాటు స్పెక్యులేటర్లు కొత్త కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగడం, ద్రవ్యోల్బణ భయాలతో బంగారంతో పాటు వెండికి గిరాకీ ఏర్పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,580 రూ.1,44,463కు చేరింది. మార్కెట్‌లో అనూహ్యంగా కొనుగోళ్ల ఊపు పెరగడం వల్లే ధరలు వేగంగా పెరిగాయని విశ్లేషకులు తెలిపారు.

# హైదరాబాద్‌లో ప్లాస్టిక్స్ ఎక్స్‌పో....




దక్షిణాదిలోనే అతిపెద్ద ప్లాస్టిక్స్ ప్రదర్శన 'హిప్లెక్స్ 2026'కు హైదరాబాద్ వేదిక కానుంది. హైటెక్స్‌లో ఏర్పాటు చేస్తోన్న నాలుగు రోజుల ఈ ప్రదర్శనను శుక్రవారం తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించనున్నారు. తెలంగాణ అండ్ ఆంధ్ర ప్లాస్టిక్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (టాప్మా) ఆధ్వర్యంలో ఆగస్టు 7 నుంచి 10 వరకు ఏడు ఎగ్జిబిషన్ హాళ్లలో 26 వేల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ప్రదర్శన జరగనుంది. బుధవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బాల్డ్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఎఐపిఎంఎ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి వెన్నం, టాప్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. భాస్కర్ రెడ్డి ప్రదర్శన వివరాలను వెల్లడించారు.
తెలంగాణ అండ్ ఆంధ్ర ప్లాస్టిక్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (టాప్మా) ఆధ్వర్యంలో ఆగస్టు 7 నుంచి 10 వరకు ఏడు ఎగ్జిబిషన్ హాళ్లలో 26 వేల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ప్రదర్శన జరగనుంది. హిప్లెక్స్ చరిత్రలోనే అతిపెద్దదైన ఈ ఎడిషన్‌లో 550 ఎగ్జిబిటర్లు, 50 వేలకు పైగా వ్యాపార సందర్శకులు పాల్గొననుండగా.. ప్రత్యేక రీసైక్లింగ్ పావిలియన్, అత్యాధునిక ప్లాస్టిక్ ఆవిష్కరణలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయన్నారు.
ఆగస్టు 6 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారికి ప్రవేశం ఉచితం కాగా, ఆ తర్వాత రోజుల్లో ప్రవేశ రుసుము రోజుకు రూ.300 ఉంటుందన్నారు. భారత్‌లో తలసరి ప్లాస్టిక్ వినియోగం సుమారు 7 కిలోలు మాత్రమే ఉండగా.. చైనాలో అది 24 కిలోలు ఉందని, ఈ రంగంలో భారత్‌కు అపారమైన వృద్ధి అవకాశాలు ఉన్నాయని వారు చెప్పారు.

